అన్ని రంగాల్లో ముందుంచుతాం

- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన
- సంక్షేమం, సామాజిక న్యాయం మా ధ్యేయం
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

పోలీస్ పరేడ్ మైదానంలో జెండా ఎగురవేసి, వందనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యేలు, తదితరులు

కరీంనగర్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ అమరుల కుటుంబాలను సన్మానించారు. పేదలకు ఆస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఈ రోజు అన్ని రంగాల్లో దశ దిశలా వెలుగులు విరజిమ్ముతున్నదని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆర్థిక, సామాజిక, పరిపాలనా రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్– 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామన్నారు. ఆడ బిడ్డలు ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టి, కోటి మందిని కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సోలార్ విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, మహిళా శక్తి క్యాంటీన్లు కేటాయిస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. జిల్లాలోని 7,626 మహిళా సంఘాలకు రూ.785.66 కోట్ల రుణాలు, 7,999 మందికి రూ.66.18 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇచ్చినట్లు వివరించారు. రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నామని, జిల్లాలో 77,726 మంది రైతులకు రూ. 605.71 కోట్లు రుణమాఫీ చేశామని, 2024–25 యాసంగిలో 65,850 మందికి రూ.132.13 కోట్ల రైతు భరోసా అందించామని వెల్లడించారు. జిల్లాలో 328 కొనుగోలు కేంద్రాల ద్వారా 3,08,683 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 51,965 మంది రైతుల ఖాతాల్లో రూ. 716.12 కోట్లు జమ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 77,083 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడుతలో 11,575 ఇండ్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో భూభారతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు పోతున్నామని, భూ సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

రైస్ మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

- అనుమతి లేకుండా మరో మిల్లుకు ధాన్యం తరలింపు
- ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్న అధికారులు

కరీంనగర్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్‌కు చెందిన ఒకే వ్యాపారికి చెందిన రెండు రైస్ మిల్లుల్లో సోమవారం సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్‌లోని రాంనగర్‌లో ఉన్న హన్మాన్ బాయిల్డ్ రైస్ మిల్, కరీంనగర్ మండలం నగునూర్‌లో ఉన్న సరస్వతి రైస్ మిల్లు కరుణాకర్ అనే వ్యాపారికి చెందినవి. అయితే, కరీంనగర్‌లోని రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం నుంచి నగునూర్‌లోని సరస్వతి రైస్ మిల్లులకు 2,008 బస్తాల ధాన్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలించినట్లు గుర్తించామని టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ తెలిపారు. ముందుగా రాంనగర్‌లోని మిల్లులో తనిఖీలు చేసిన అధికారులు ఈ మిల్లుకు కేటాయించిన ధాన్యం పూర్తి స్థాయిలో లేకపోవడంతో మిల్లర్‌ను ప్రశ్నించారు. ఈ ధాన్యాన్ని నగునూర్‌లోని తన మరో మిల్లుకు తరలించినట్లు తెలపడంతో అక్కడికి వెళ్లి తనిఖీలు చేయగా దానికి సంబంధించిన నిలువలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఒక మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని మరో మిల్లుకు తరలించాలంటే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ మిల్లరు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా ధాన్యాన్ని తరలించినట్లు అధికారులు గుర్తించారు. పైగా రాంనగర్‌లోని మిల్లులో ధాన్యం మరాడించేందుకు పూర్తి స్థాయిలో యంత్రాలు లేవని అధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో యంత్రాలు లేని మిల్లుకు అధికారులు ధాన్యం కేటాయించడం సందేహాస్పదంగా మారింది. మొత్తానికి సివిల్ సప్లయ్ అధికారులు కేటాయించిన ధాన్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా మరో మిల్లుకు తరలించినట్లు గుర్తించిన అధికారులు శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. తనిఖీల్లో ఓఎస్‌డీతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, డీఎస్‌వో నర్సింగరావు తదితరులు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

తిమ్మాపూర్, జూన్ 2: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రేణికుంట గ్రామానికి చెందిన నల్లాల జీవన్ రెడ్డి (37)కి కొన్నేండ్ల క్రితం చిన్నకోడూరు మండలం ఎల్లయ్యపల్లె (చలకాలపల్లి) గ్రామానికి చెందిన దీపతో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబంతో కలిసి రేణిగుంటలో ఉంటున్న వీరి మధ్య ఇటీవల కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో దీప తమ పిల్లలతో కలిసి తల్లి గారింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన జీవన్ రెడ్డి సోమవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎల్ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. జీవన్‌రెడ్డి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి

శంకరపట్నం, జూన్ 2: మండలంలోని ప్రసిద్ధ మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డిని నియమిస్తూ దేవాదాయ–ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు. కోరెం రాజిరెడ్డి దేవస్థాన చైర్మన్‌గా, గ్రామానికి చెందిన రామగిరి తిరుమల, ఎడ్ల తిరుపతి, కె. రత్నం, ఎన్. లక్ష్మణ్‌రావు, ఎం. రవీందర్, పి. తిరుపతి డైరెక్టర్లుగా నియామకమయ్యారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాన్ని అందుకున్నారు.

నూతన ఏవోగా శంకరయ్య

తెలంగాణచౌక్, జూన్ 2: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా అలువాల శంకరయ్య ఏవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఏవో ఉద్యోగ విరమణ పొందగా, ఆదిలాబాద్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శంకరయ్య బదిలీపై కరీంనగర్‌కు వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన తర్వాత, ఆర్ఎం రాజును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన ఏవోను కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

న్యూసెన్స్ క్రియేట్ చేసిన ఒకరి బైండోవర్

కరీంనగర్ రూరల్, జూన్ 2: కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని చంద్రపూర్ కాలనీలో రాత్రి సమయంలో తన హోటల్ పరిసరాల్లో ప్రొజెక్టర్ ద్వారా లైవ్ మ్యాచ్ చూపిస్తూ, ఆ ప్రాంతంలో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న చొప్పరి దిలీప్‌కుమార్‌ను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట బైండ్ ఓవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వీణవంక, జూన్ 2: మండలంలోని కొండపాక గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కరీంనగర్ మెడికవర్ వైద్యులు గ్రామంలోని మున్నూరుకాపు కులస్తులతో పాటు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు, మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంజీవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గన్నేరువరం, జూన్ 2: గుండ్లపల్లిలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వివరాలు ఎస్ఐ నరేశ్ తెలిపిన ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన శివరాత్రి గోపి గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో నివాసముంటూ హన్మాజీపల్లిలోని ఓ క్వారీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మే 27న ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. తెల్లవారి చూసే సరికి వాహనం కనిపించకుండా పోయిందని గోపి సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ వెల్లడించారు.

కరీంనగర్ పారమిత పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది

జాతీయ పతాకావిష్కరణలో జిల్లా జడ్జి సాధన, జడ్జీలు, పీపీలు, న్యాయవాదులు

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

- వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
- పరేడ్ మైదానంలో ఆకట్టుకున్న కార్యక్రమాలు

కార్పొరేషన్/కలెక్టరేట్/కోర్టు చౌరస్తా/హౌసింగ్‌బోర్డుకాలనీ/ తెలంగాణచౌక్/ కొత్తపల్లి/ ముకరంపుర/ గంగాధర/ జమ్మికుంట/ హుజూరాబాద్ టౌన్/ చొప్పదండి/ ఇల్లందకుంట/ చిగురుమామిడి/ మానకొండూర్/ రూరల్/ గన్నేరువరం/ సైదాపూర్/ శంకరపట్నం/వీణవంక/కరీంనగర్ రూరల్/ తిమ్మాపూర్, జూన్ 2: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలను సోమవారం ప్రజలంతా ఘనంగా జరుపుకొన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులు, విద్యాసంస్థల్లో ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు జెండా ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు అనిల్ కుమార్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతా మహేశ్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, నాయకులు గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కుర్ర తిరుపతి, సుధగోని మాధవీ కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, గందె మాధవి మహేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, శ్రీనివాస్‌రెడ్డి, కాసారపు శ్రీనివాస్ గౌడ్, గడ్డం ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుడా కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో సుడా సిబ్బంది, నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని పారమిత విద్యాసంస్థల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, వినోద్ రావు, రాకేశ్, రశ్మిత, ప్రాచి, వీయూఎం, ప్రసాద్, టీఎస్‌వీ. రమణ, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఆర్‌డీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఆర్‌డీవో వేణుమాధవ్, తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు, రహదారులు భవనాల శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయాచోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ సంక్షేమాధికారి పవన్‌కుమార్, డీఎవో భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాళీచరణ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవన సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇన్‌చార్జి న్యాయమూర్తి అయిన రెండో అదనపు జిల్లా జడ్జి సాధన జాతీయ పతాకావిష్కరణ చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి టి. విక్రమ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్, అడిషనల్ సబ్ జడ్జి రాణి, మెజిస్ట్రేట్లు మహమ్మద్ షరీనా, చిరాగ్ మెహతా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, కార్యదర్శి అరుణ్ కుమార్, సిరికొండ శ్రీధర్, కోర్టు పరిపాలన అధికారి మాధవి, న్యాయవాదులు, కోర్టు పోలీస్ సిబ్బంది, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ జోనల్ ఈడీ సోలమన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డీఎంలు విజయమాధురి. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. నగరంలోని సీపీఐ పార్టీ కార్యాలయం ఎదుట రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రంథాలయ ఆవరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ మేక రమేశ్ బాబు, టీఎన్జీవోల సంఘ భవనంలో తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రామడుగు మండలంలోని సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధిక, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ తీశారు. చొప్పదండి పట్టణంతో పాటు ఇల్లందకుంట, చిగురుమామిడి, మానకొండూర్, గన్నేరువరం, వీణవంక, శంకరపట్నం, కరీంనగర్ రూరల్, తిమ్మాపూర్ మండలాల్లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సైదాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు జెండా ఎగురవేసిన అనంతరం ర్యాలీగా వెళ్లి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఏసీపీ విజయ్‌కుమార్‌కు ఉత్కృష్ట, పోలీసులకు సేవా పతకాలు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పోలీస్ పరేడ్ మైదానంలో కర్రసాము ప్రదర్శిస్తున్న బాలభవన్ విద్యార్థినులు

దివ్యాంగులకు చెక్కుల పంపిణీ

కలెక్టరేట్, జూన్ 2 : ఆర్థిక పురోగతి పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది దివ్యాంగులకు మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో దివ్యాంగులకు ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున వంద శాతం సబ్సిడీపై కిరాణా దుకాణాల ఏర్పాటుకు సాయమందిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతకుముందు జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రసంగించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు చెందిన పలువురిని సన్మానించారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

బాలభవన్‌లో పలు అంశాల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు, కర్రసాము ఆకట్టుకున్నాయి. చిన్నారులను మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. అలాగే, ఉత్తమ సేవలందించిన పోలీసులను వరించిన ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలు అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు, భూభారతి కింద సైదాపూర్ మండలంలోని ఆరుగురు రైతులకు మంత్రి ప్రొసీడింగ్స్ అందజేశారు. మిషన్ వాత్సల్య పథకంలో ఎంపికైన 193 మంది బాలలకు విడుదలైన రూ.48.24 లక్షల చెక్కు, పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆయుధాలు తిలకించారు. వాటిని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన డీఎంహెచ్‌వో

విద్యానగర్, జూన్ 2: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కార్యాలయంలో సమగ్ర ఆరోగ్య ప్రచారం(ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా నాలుగు టీమ్‌లు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేస్తాయని, అవసరమైన వారికి మందులు ఇస్తారని తెలిపారు. అలాగే జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి(ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ సుధ తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సబ్ సెంటర్ తిమ్మాపూర్‌లో సమగ్ర ఆరోగ్య ప్రచారానికి సంబంధించిన హెల్త్ క్యాంపు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజిదా, పీవోడీటీ డాక్టర్ ఉమాశ్రీ రెడ్డి, పీవోఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియా, డెమో రాజగోపాల్, డీపీఎం స్వామి, సురేందర్, మొబైల్ ఐసీటీసీ టీం(ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్), ఎన్జీవో పద్మపాని లింక్ వర్కర్స్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED TEACHERS
To teach:
Pre-Primary and Primary (All subjects)
High School (Hindi, English, Social)
Interested candidates can walk-in the school between 9 AM to 5 PM on all working days.
VISHWA BHARATHI GROUP OF SCHOOLS
Annapurna Colony, NTPC, Ramagundam
9700745078 9849176409

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కడారి రవికి మంత్రి శ్రీధర్ బాబు నివాళి

కొత్తపల్లి, జూన్ 2 : కొమురవెల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిజికల్ డైరెక్టర్ కడారి రవి మృతిచెందగా, ఆయన మృతదేహాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. నగరంలోని సవరన్ స్ట్రీట్‌లో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కడారి రవి మృతి క్రీడా రంగానికి తీరని లోటన్నారు. మంత్రి వెంట మానకొండూర్, జగిత్యాల ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

పది లక్షల కోట్ల అప్పు చేసి సాధించిందేమిటి?

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

జెండా ఆవిష్కరించి, వందనం చేస్తున్న బండి సంజయ్

విద్యానగర్, జూన్ 2: ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దాదాపు రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీయించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. లక్షల కోట్ల అప్పు చేసినా రాష్ట్ర ప్రజల బతుకులు మారలేదని, ఆరు గ్యారెంటీలు సహా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీజేపీ నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు కూడా ఇయ్యలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నదన్నారు. అన్ని వర్గాల ఆశలను కాంగ్రెస్ పార్టీ అడియాశలు చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 2: మండలంలోని ఆముదాలపల్లి శివారులో